క్లుప్తంగా

నేడు బ్రాహ్మణపల్లెలో పర్యటించనున్న ఎమ్మెల్యే

కొమరోలు: గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు గురువారం బ్రాహ్మణపల్లె గ్రామసచివాలయం పరిధిలోని గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు జెడ్పీటీసీ సారె వెంకట నాయుడు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పలు గ్రామాల్లో పర్యటిస్తారని, మండలంలోని వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సచివాలయ సిబ్బంది మెరుగైన సేవలందించాలి

త్రిపురాంతకం: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యతగా పనిచేసి మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీవో సాంబశివరావు సూచించారు. బుధవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం త్రిపురాంతకం మండలం మేడపి గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయానికి కార్యాలయానికి హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ మురళీ మోహన్, పీఎస్ వెంకిరెడ్డి ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన త్రిపురాంతకం ఎంపీడీవో


నూతన ఎంపీడీవో సాంబశివరావు

త్రిపురాంతకం: త్రిపురాంతకం ఎంపీడీవోగా సాంబశివరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. సంతమాగులూరు ఎంపీడీవోగా పనిచేస్తూ ఎఫ్ఏసీ ద్వారా త్రిపురాంతకం ఎంపీడీవోగా ఆయన నియమితులయ్యారు. ఇప్పటివరకు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏవో మరియదాస్ నుంచి బాధ్యతలు స్వీకరించారు.

పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన డీఎస్పీ

కురిచేడు: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను దర్శి డీఎస్పీ టి.అశోక్‌వర్ధన్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. సాధారణ పరిశీలనలలో భాగంగా ఆయన మండలానికి వచ్చినట్లు పేర్కొన్నారు. పోలీసు స్టేషనులో రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు. మండలంపై అవగాహన కోసం పరిశీలనకు వచ్చినట్లు పేర్కొన్నారు. మండల పరిస్థితిని ఎస్సై ఎం దేవకుమార్ డీఎస్పీకి వివరించారు.

అనుమానాస్పద స్థితిలో సచివాలయ ఉద్యోగి మృతి


మృతి చెందిన రామకృష్ణ

కంభం: అనుమానాస్పద స్థితిలో సచివాలయ ఉద్యోగి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే అర్ధవీడు మండలం మాగుటూరు గ్రామంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామకృష్ణ (28) యూనియన్ బ్యాంక్ సమీపంలో అద్దెకు ఉన్న ఇంట్లో మృతి చెంది పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా అతను చనిపోయి ఉన్నాడు. గదిలో ఓ మద్యం సీసా ఉంది. నోట్లో నుంచి నురగ వచ్చి ఉంది. ఆత్మహత్య చేసుకున్నాడా లేదా మరేదైనా కారణం ఉందా అని పోలీసులు విచారిస్తున్నారు. మృతుడి స్వగ్రామం దర్శి మండలం వేముల గ్రామం.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ కృషి

- రూ.1.2 కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే అన్నా
- పీహెచ్‌సీలకు రూ.6 లక్షల ఫర్నిచర్ పంపిణీ


అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

బేస్తవారిపేట: పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని, అప్పుడే వారికి బంగారు భవిష్యత్తు లభిస్తుందనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో గురువారం రూ.1.20 కోట్లతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు మించిన వసతులు కల్పిస్తోందన్నారు. పేద విద్యార్థులకు విద్య భారం కాకూడదని, విద్యార్థులందరూ బాగా చదువుకోవాలనే ఉద్దేశంతో అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతిదీవెన, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అమలు చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో మాత్రమే విద్యలో విప్లవాత్మక సంస్కరణలకు సీఎం శ్రీకారం చుట్టారన్నారు.

పీహెచ్‌సీలకు రూ.6 లక్షల పరికరాలు పంపిణీ

మండలంలోని నాలుగు పీహెచ్‌సీలకు మండల పరిషత్ నిధులతో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి రూ.6 లక్షల విలువైన పరికరాలను కేటాయించారు. ఈ పరికరాలను ఎమ్మెల్యే అన్నా రాంబాబు పీహెచ్‌సీ వైద్యాధికారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు, వైద్యశాలలకు అవసరమైన ఫర్నిచర్ ఏర్పాటుకు మండల పరిషత్ నిధులు కేటాయించడం సంతోషదాయకమన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యత మరువకుండా ఉత్తమ సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, మండల ఉపాధ్యక్షుడు డీ ఖాజామీయా, ఎంపీటీసీలు మల్లెల శేఖర్‌రెడ్డి, గుంటి చిరంజీవి, దగ్గుబాటి బాలరంగయ్య, సర్పంచ్‌లు, మార్కాపురం ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వరి, ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు, కాంట్రాక్టర్ వెన్నా భాస్కర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజారంజక పాలన అందిస్తున్న జగనన్న

- ఎమ్మెల్యే రాంబాబు


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కొమరోలు: వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. కొమరోలు మండలంలోని రాజుపాలెం గ్రామ సచివాలయం పరిధిలోని రాజుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బుధవారం పర్యటించారు. గ్రామానికి చేరుకున్న అన్నా రాంబాబుకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే పూజలు చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే రాంబాబు గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు క్షేత్రస్థాయిలో అందుతున్నాయా, లేదా, ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటూ ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టేలా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో గిద్దలూరు జెడ్పీటీసీ బుడత మధుసూదన్‌రావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోయిళ్ల జనార్ధన్‌రెడ్డి, గ్రామసర్పంచ్‌లు హటేల్‌పీరా, ప్రదీప్, జయరామిరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు ఖాశింసాహెబ్, వైఎస్ఆర్ సీపీ నాయకులు అలెగ్జాండర్, ఏలూరి రమణయ్య, తోట సురేష్, గోడి రాఘవరెడ్డి, బొమ్మిని వెంకటేశ్వర్లు, గిద్దలూరు ఏడీఏ బాలాజీనాయక్, ఏఓ రాజశ్రీ పాల్గొన్నారు.

అధికారులు లేకుండా సమావేశాలు ఎందుకు

- వాడీవేడిగా సర్వసభ్య సమావేశం


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

రాచర్ల: మూడు నెలలకు ఒక్కసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలను అధికారులు లేకుండా ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ షేక్.ఖాశింబి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. పాలకవీడు పంచాయతీలో లైన్‌మెన్, జేఎల్ఎమ్ అందుబాటు ఉండటం లేదని పాలకవీడు సర్పంచ్ పల్నాటి లతీఫ్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ కార్యదర్శి గణేష్ సచివాలయంలో అందుబాటులో ఉండటం లేదని సర్పంచ్ వివరించారు. ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన విద్యుత్‌శాఖ ఏఈ రామచంద్రుడు సమావేశం ప్రారంభం కాగానే వెళ్లిపోవడంపై అనుములపల్లె, పాలకవీడు, చినగానిపల్లె సర్పంచులు రమేష్, పల్నాటి లతీఫ్, పగడాల రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలో రెండు రోజుల మాత్రమే ఎంఈవో కోటేశ్వరరావు కార్యాలయంలో అందుబాటులో ఉంటున్నారని, మిగతా రోజుల్లో ఒంగోలు చేరుకుంటున్నారని అనుములపల్లె సర్పంచ్ రమేష్ చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో వార్షికోత్సవం నిర్వహించే సమయంలో ప్రొటోకాల్ ప్రకారం సర్పంచులకు, ఎంపీటీసీలకు చెప్పడం లేదన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు కేవలం మండల సర్వసభ్య సమావేశంలో మాత్రమే కనిపిస్తున్నారన్నారు. ఆకవీడు గ్రామంలో ఫీల్డ్‌అసిస్టెంట్ వారానికి ఒక్కసారి మాత్రమే హాజరు వేస్తున్నారని సర్పంచ్ తలపాటి దేవదానం సమావేశం దృష్టికి తీసుకుని వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే.కవితా చౌదరి, వ్యవసాయాధికారి షేక్.అబ్దుల్ రఫీక్, హార్టీకల్చర్ హెచ్‌వో శ్వేత, గృహనిర్మాణశాఖ ఏఈ విజయలక్ష్మి, ఇర్వి పిడతల గంగిరెడ్డి, ఆకవీడు పీహెచ్‌సీ డాక్టర్ డి.ఖాదర్‌బాష, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

కంభం: నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని జలజీవన్ మిషన్ డివిజన్ కో ఆర్డినేటర్ షేక్ ముతహర్ సుల్తాన అన్నారు. మండలంలోని దద్దవాడ సచివాలయంలో బుధవారం రక్షిత మంచినీటి పథకం, జలజీవన్ మిషన్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి ఇంటికి కుళాయి, స్వచ్ఛమైన నీరు అందజేయడమే లక్ష్యంతో పాటు నిర్వహణ, నిర్మాణం పంచాయతీ మీద ఆధారపడకుండా నీటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కాచి వడపోసిన నీటిని తాగడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు.

నాడు-నేడు పనులు గడువులోగా పూర్తి చేయాలి

కంభం: నాడు–నేడు పనులు గడుపు లోపల పూర్తి చేయాలని డిప్యూటీ డీఈఓ అన్నారు. బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో రెండో దశ నాడు–నేడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రెండో దశ నాడు–నేడు పాఠశాలల నిర్మాణ స్థితి, ఖర్చు, నిల్వలపై ఆరా తీశారు. ఖాతాలో నగదు నిల్వలు లేని పాఠశాలలు నగదు, వస్తుసేవల సర్దుబాటు ద్వారా సహకరించుకొని పనులను ముందుకు నడిపించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి మాల్యాద్రి, ప్రధానోపాధ్యాయుడు బీవీ రామకృష్ణ, మండల సమన్వయకర్త చిన్ని పద్మావతి, సీఆర్పీలు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: తాను సీఎం వైఎస్ జగనన్న సేవకుడినని, ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అట్టడుగు వర్గాలకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని రెండో వార్డులోని ఏకలవ్య కాలనీలో గడప గపడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరగని అభివృద్ధి గడిచిన నాలుగేళ్లలో సాధ్యమైందన్నారు.సచివాలయ, వలంటరీ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో అన్నదాతల కష్టాలు తీరుతున్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

కాంపౌండ్ వాల్ ప్రారంభం

ఏకలవ్య కాలనీలో రూ.5 లక్షల వ్యయంతో శ్మశాన వాటికలో నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. పలువురు మహిళలు ఎమ్మెల్యే తన ఇంటి ముందుకు రాగానే హారతులు పట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు సిరాజ్, హర్షిత బాబీ, కరిముల్లా, షెర్వావలి, వార్డు ఇన్‌చార్జులు ఉత్తమ్‌కుమార్, రంగయ్య, రహ్మతుల్లా, ఖాలిద్, పార్టీ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, వరప్రసాద్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్లకు సేవా పురస్కారాలు ప్రదానం


వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం టౌన్: అనునిత్యం ప్రజలతో మమేకమై సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న వలంటీర్ల సేవకు హేట్సాఫ్ అని ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మునిసిపల్ కౌన్సిల్ హాల్లో మునిసిపాలిటీ పరిధిలోని ఆరు నుంచి పదో వార్డు వరకు వలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా ప్రభుత్వ పథకాలను గడప గడపకు అందిస్తూ వలంటీర్లు మంచిపేరు తెచ్చుకున్నారన్నారు. ప్రభుత్వానికి ఇంకా మంచి పేరు తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు. వలంటీర్లకు సేవామిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలు అందించి సన్మానించారు. మునిసిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కమిషనర్ గిరికుమార్, వార్డు ఇన్‌చార్జులు ఉత్తమ్ కుమార్, బాబీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు జగనన్న భరోసా

దర్శి: విద్యార్థుల భవిష్యత్‌కు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి మంచి బరోసా కల్పిస్తున్నారని ఏఎంసీ డబ్ల్యూఓ ఎస్‌కే రజియాబేగం అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గౌతమి డిగ్రీ కళాశాలలో జగనన్న విద్యాదీవెన పథకం కింద విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధుల చెక్‌ను ఏఎస్ డబ్ల్యూఓ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా రజియా బేగం మాట్లాడుతూ పేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదవాలన్న సమున్నత లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. విద్యార్థులు చక్కగా చదివి ఉన్నత శిఖరాలు ఎదగాలని కోరారు. వార్డెనర్లు ఎం హరిబాబు, రామకృష్ణారెడ్డి, నరసింహారావు, పి.అరుణాదేవి, ఎం రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆడదూడల పోషణపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా పశువైద్యాధికారి బేబీరాణి

దర్శి: ఆడదూడల పోషణపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్యాధికారి కె.బేబీరాణి సూచించారు. స్థానిక ఏరియా పశువైద్యశాలలో పశువైద్య సహాయకులతో బుధవారం రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్బీకేలో ఉన్న పశువర్ధక సహాయకులు కృత్రిమ గర్భదార ఇంజక్షన్‌లు నాలుగు నెలలు పాటు ఉచితంగా చేయాలని ఆదేశించారు. ప్రతి ఉద్యోగి సచివాలయంలో అందుబాటులో ఉండి పాడి రైతులకు ఉత్తమ సేవలందించాలని ఆదేశించారు. జిల్లా అధికారి ఎస్‌కే కాలేషా ,ఉపసంచాలకుడు డాక్టర్ రమేష్, దర్శి సహాయ సంచాలకులు డాక్టర్ పురుషోత్తం రాజు, బొట్లపాలెం, తాళ్లూరు, ముండ్లమూరు, గంగవరం పశు వైద్యాధికారులు బసవయ్య, రాంబాబు, విజయలక్ష్మి, నాగమణి సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలతో డీప్ బోరుకు మరమ్మతులు


బోరును బాగుచేస్తున్న సిబ్బంది

త్రిపురాంతకం: మండలంలోని కంకణాలపల్లి ఎస్సీకాలనీలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు పలు సమస్యలు తెలియజేశారు. డీప్ బోర్ చెడిపోయిందని, మురుగునీరు పోయే దారిలేక రోడ్డుపై నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని మంత్రి సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని మంత్రి సురేష్ అధికారులను ఆదేశించడంతో బుధవారం డీప్ బోరుకు మరమ్మతులు పూర్తి చేసి నీటి సమస్యను పరిష్కరించారు. డ్రైనేజీ కోసం పొక్లెయిన్‌తో పనులు ప్రారంభించారు. సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపట్టడంతో మంత్రి సురేష్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేసి హర్షం వ్యక్తం చేశారు.

పిచ్చిరెడ్డికి సేవా పురస్కారం

పొదిలి: పొదిలి పట్టణానికి చెందిన రిటైర్డ్ టీచర్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉడుముల పిచ్చిరెడ్డికి అనన్య ఫౌండేషన్, లిటిల్ చాంప్స్ అకాడమీ వారు పురస్కారం అందజేశారు. సికింద్రాబాద్‌లోని తార్నాక ఎంఎం ఫంక్షన్ హాల్లో పిచ్చిరెడ్డి సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సినీ దర్శకులు నరసింహ నంది, డాక్టర్ లయన్ పులి శ్రీనివాస్ ప్రసాద్, లిటిల్ చాంప్స్ అకాడమీ సెక్రటరీ బుచ్చేశ్వరరావు, తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ బెల్లం మాధవి, అనన్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు నవనీత, జీవనది ఫౌండేషన్ వ్యవస్థాపకులు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

జెడ్పీ గర్ల్స్ హైస్కూల్ పీడీకి సన్మానం

మార్కాపురం: దక్షిణ కొరియాలో నిర్వహించిన ఆసియా పసిఫిక్ మాస్టర్‌గేమ్స్‌లో భారత్ తరఫున పాల్గొని పతకాలు సాధించిన మార్కాపురం జెడ్పీ బాలికోన్నత పాఠశాల పీడీ డోలా శ్యామలదేవిని బుధవారం పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర బైలా కమిటీ అధ్యక్షుడు ఎం.రామాంజనేయులు మాట్లాడుతూ.. దేశం తరఫున పాల్గొని రెండు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం సునీత పాల్గొన్నారు.

పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

బేస్తవారిపేట: మండలంలోని పిటికాయగుళ్ల జెడ్పీ హైస్కూల్‌లో 1988–89 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆనందంగా పాలుపంచుకున్నారు. విద్య నేర్పిన గురువులైన మద్దుల సుబ్బారెడ్డి, కాల్వ శ్రీనివాసులు, ఓ సత్యనారాయణ, పీ శివప్రసాద్, పీ అల్లాబకాష్‌ఖాన్‌లను శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు పాఠశాలకు ఇన్వర్టర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లెల శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్రా సత్యనారాయణరెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ ఆసిఫ్ అలీ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

టెన్త్ విద్యార్థులకు సన్మానం



మార్కాపురం: బీసీ వసతి గృహాల్లో ఉంటూ పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను బుధవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖామాత్యులు సీహెచ్ వేణుగోపాలకృష్ణ, కమిషనర్ అనంతరామ్ సన్మానించినట్లు మార్కాపురం డివిజన్ బీసీ సంక్షేమ శాఖాధికారి షేక్ జబ్బార్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 18 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించగా అందులో మార్కాపురం, కనిగిరి, పామూరుకు చెందిన ఆరుగురు ఉన్నారని పేర్కొన్నారు.

రాచర్ల ఏపీవోగా మోసే

రాచర్ల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవోగా పి.మోసే బుధవారం పూర్తి బాధ్యతలు చేపట్టారు. గతంలో రాచర్ల ఏపీవోగా విధులు నిర్వహించిన సుజాత త్రిపురాంతకం మండలానికి బదిలీ కావడంతో ఆమె స్థానంలో త్రిపురాంతకం మండల ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న ఏపీవో పి.మోసేను రాచర్ల ఏపీవోగా నియమించారు.

ఆర్‌బీకేల పరిశీలన

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోట, మంగినపూడి ఆర్‌బీకేలను వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచన, సలహాలు అందించారు. ఆర్‌బీకేలో రైతులకు సంబంధించిన విత్తనాలు, మందు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయ పనిముట్లు 50 శాతం రాయితీపై అందిస్తున్నామన్నారు. ఈకేవైసీ చేసుకున్న వారికే పీఎం కిసాన్ నగదు బ్యాంక్ ఖాతాలో జమవుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలపై విచారణ

ముండ్లమూరు: మండలంలోని బృందావనం తండా గ్రామంలో ఉపాధిహామీ పథకం పనుల్లో జరిగిన అక్రమాలపై దర్శి క్లష్టర్ ఏపీడీ పద్మశ్రీ బుధవారం విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పనుల చేస్తున్న ప్రదేశానికి వెళ్లగా ఇరు వర్గాలమధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. గ్రామం వదిలి ఇతర ప్రాంతాలకు పనులకు వెళ్లిన వారికి మస్టర్లు వేయడం వలన ఇక్కడే ఉండి పనులు చేస్తున్న కూలీలకు కూలి గిట్టుబాటు కావడం లేదని ఆమె ఎదుట కూలీలు వాపోయారు. సుమారు వంద మంది కూలీలకు అదనంగా పనులకు వెళ్లని వారికి మస్టర్లు వేస్తున్నారని సర్పంచ్ లక్ష్మీభాయి ఏపీడీ దృష్టికి తీసుకువెళ్లారు. కూలీలను విచారిస్తుండగానే ఒకరిపై ఒకరు దూషించుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో ఏపీడీ అక్కడి నుంచి వెళ్లారు. మరో సారి విచారణ చేపడతామని తెలియజేశారు.

26న దివ్యాంగుల ఉచిత మెగా క్యాంపు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో ఈ నెల 26వ తేదీ వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో ఉచిత మెగా క్యాంపు నిర్వహించనున్నట్లు ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో ఈ నెల 5వ తేదీన కొలతలు తీయించుకున్న దివ్యాంగులకు మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి చేతులమీదుగా కృత్రిమ అవయవాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ట్రైసైకిల్స్, వీల్ చైర్స్ కావాల్సినవారి వివరాలు నమోదు చేసుకుంటామని చెప్పారు. కార్యక్రమానికి వచ్చే దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, వైకల్యంతో ఉన్న 4 పాసుపోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

టైలరింగ్ శిక్షణ ప్రారంభం

కురిచేడు: రిలయన్స్ ఫౌండేషన్, ఎఫర్ట్ సంస్థ సంయుక్తంగా పాదుపు మహిళలకు టైలరింగ్‌పై అవగాహన కార్యక్రమం బుధవారం బోధనంపాడులో ప్రారంభమైంది. మహిళలు టైలరింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ వంటి కోర్సులకు అవకాశాలను అందుకొని ముందుకు రావాలని రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ బాబూరావు తెలిపారు. ఎస్ఎస్‌పీ అగ్రహారం కార్యదర్శి గురుచక్రపాణి, ఎఫర్ట్ సంస్థ సీఈఓ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి


స్వామి సన్నిధిలో కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి

దర్శి టౌన్: తిరుమల శ్రీవారిని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ బుధవారం కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఆత్మహత్యపై త్రీమెన్ కమిటీ విచారణ

మార్కాపురం టౌన్: మండలంలోని కొండేపల్లి పంచాయతీలో ఈ నెల 18వ తేదీన అప్పుల బాధను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న మూల ఆదినారాయణమ్మ ఇంటి వద్ద బుధవారం త్రీమెన్ కమిటీ విచారణ చేపట్టింది. కుటుంబ సభ్యులను, గ్రామస్తులను అడిగి ఆత్మహత్యకు గల కారాణాలను కమిటీ సభ్యులు తెలుసుకున్నారు. నివేదికను ప్రభుత్వానికి పంపి రైతు కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కమిటీలో తహసీల్దారు ఎం.హరిబాబు, ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎస్సై సుమన్, వీఆర్వో మల్లేశ్వరి ఉన్నారు.